# జీవన నైపుణ్యం



"మంచేదో, చెడేదో తెలీని ఎర్రిబాగులోణ్ణి కాదు. అన్నిందాల ఆలోచించే శీనయ్యకు మాటిచ్చాను" ఘంటాపథంగా నొక్కి మరీ చెప్పాడు పానకాలు.

"మాటిచ్చే ముందు ఇంటో వాళ్లకు చెప్పక్కర్లేదా?"

"ఏం, చెప్పిగాని చెయ్యకూడదా! పేనుకి పెత్తనమిత్తే తలంతా గొరిగిందంటలే" వెటకారంగా అన్నాడు.

"కట్టుకున్న పెళ్లాన్ని, కన్న కూతుర్ని యిచారించటం గూడ చిన్న తనమంటనా?" నాగమ్మ నిష్ఠూరంగా అన్నది.

"ఏందే మీతో యిచారించేది, మాలావు తెలివిగలోళ్లు బయల్దేరారులే" అంటూ విదిలించి పారేశాడు.

"నీకు నువ్వు గొప్పనుకోంగానే సరిపోయిందా? ఏ పెద్దమనిషి నడిగినా నువ్వు జేసేది ఎంత బుద్ధి తక్కువ పనో చెప్తారు" అంటూ భర్త మాటలు సహించలేక ఎదురు దాడికి దిగింది.

"ఏ పెద్ద మనిషిని పిలిచి చెప్పిత్తావే, రమ్మను. ముగ్గురాడపిల్లల్ని కని నా గుండెల మీదేశావు. ఎట్టా యిరగడ చెయ్యాల్రా దేవుడా అని నేను చత్తంటే, పంచాయితీ పెట్టిస్తా?"

"మన బాగ్గేనికి ఒక బిడ్డ చాలని మొత్తుకున్నా. మగ నలుసు లేకుంటే ఎట్టాగంటూ బిడ్డ మీద బిడ్డని కనిపించి నన్నాడిపోసుకొంటావేం?" మాటకు మాట అంటిస్తున్నది గాని వెనక్కు తగ్గటం లేదు నాగమ్మ.

"ఇదుగో, వంద మాటలనవసరమే. ఇందిర నా కూతురు. దాని పెళ్లి నా ఇష్టం" మొండికి తిరిగాడు.

"ఆ పిల్ల నీకెంతో నాకూ అంతే! దాని బతుకు గుండాన బడతంటే చూత్తా వూరుకోలేను."

"ఊరుకోలేకపోతే ఉరేసుకు చావ్వే!"

"నే చత్తే నీ అరాచకం సాగించొచ్చనా? బతికే సాధిస్తా నిన్ను. దాని బతుకు బండలు గాకుండా చూస్తా" గట్టి సవాలు విసిరింది నాగమ్మ.

దాంతో పానకాలు పురుషాహంకారం కట్టలు తెంచుకొంది. మాటకు మాట బదులు చెప్తూ ఎదురాడుతున్న నాగమ్మ నిర్భీతిని సహించలేక పోయాడు. పశు బలంతో మీద పడి జుట్టు పట్టుకొని వంగదీసి గబ గబ గుద్దుతూ వీరంగం వేశాడు. నాగమ్మ దెబ్బలు భరిస్తూ శాపనార్థాలు పెట్టింది గాని వెనక్కు తగ్గలేదు.

ఇంట్లో నాలుగైదు రోజులుగా నిత్యం జరుగుతున్న గొడవే ఇది. పానకాలు మూర్ఖత్వంతో నాగమ్మ తలపడలేక పోతోంది. ఏమైనా కూతురు బతుకు నాశనం గాకుండా చూడాలని నాగమ్మ మంచి పట్టుదల మీదుంది.

"ఏం నాగమ్మొదినా! పాతూరి శీనయ్య కొడుకుతో ఇందిర పెళ్లి ఖాయమైందటగా?" అంటూ ఆరా తియ్యబోయింది పార్వతి.

"ఎవరంటా ఖాయం జేసింది?" గయ్‌న లేచింది.

"పానకాలన్న మా ఆయనకు చెప్పేడంటేను...." నసిగింది.

"నా ఇష్టం, నా కూతురిష్టం లేకుండానే ఖాయం జేస్తాడా మీ అన్న?"

"మీ కిష్టం లేదన్న సంగతి మాకేం తెల్సుగానొదినా, పిల్లాడు మంచి కుదురైనోడు, పనిమంతుడూనని అంటుంటే పోనీ మంచిదేలెమ్మనుకున్నాలే."

"పెళ్లంటే అంతవరకు ఆలోచిస్తే సరిపోద్దా పార్వతీ! ఈడూ జోడూ చూడక్కర్లా! మా ఇందిరకు ఇంకా పద్దానుగేళ్లన్నా నిండలేదు. ఆ పిల్లాడికి ఎట్టలేదన్నా పాతి కేళ్లుంటాయి గదా!"

" పిల్లాడి వయసెక్కువనా నీ అభ్యంతరం?"

"ఇద్దరి వయసుల్లో తేడా గురించి కాదు! అసలు పద్దానుగేళ్లకు దానికి పెళ్లేంటో చెప్పు?"

"మన పెళ్లిల్ల నాటికి మనకామాత్రం వయసన్నా లేకపోయిందిగాదొదినా! మన ఇష్టా ఇష్టాల గురించి అడిగిందెవరూ! పెళ్లన్నారు. మేళాలు పెట్టించారు. మెడలో పసుపుతాడుతో మూడు ముళ్లేయించారు. కాపురాలకు తోలారు" నిస్పృహ తొంగి చూసింది పార్వతి మాటల్లో.

"ఆడపిల్లకు ఇరవైయేళ్లన్నా దాటకుండా పెళ్లేంటసలు. చదువు తప్పితే రెండోధ్యాస లేని పిల్లది. సంసారానికి, సంతానానికీ తగిన గ్యానం వున్న వయసంటావా ఇది. ముప్పయ్యేళ్లకే మనం అమ్మమ్మలమై ముసలితనాన్ని మూటగట్టుకోవాల్సిన గతి పట్టిస్తున్నారు" ఆక్రోశంగా అన్నది నాగమ్మ.

"మన మాటంటే ఈ మొగాళ్లకు లెక్కుంటేగా! వాళ్లనుకొన్నది జరిగితీరాలంతే! ఏదో గొర్రెదాటు బతుకుల కలవాటైపొయ్యాం" నిరాశ తొంగి చూసింది పార్వతి మాటల్లో.

"నా పెళ్లి నాటికి ఈ పాటి గ్యానం నాకూ లేదు, నన్ను కన్నోళ్లకూ లేదు. కనీసం నా బిడ్డల విషయంలోనైనా ఆ తప్పు జరగకుండా కాచుకోవాలని నా కోరిక." ఒక రకమైన తెగింపు కనిపించింది నాగమ్మ మాటల్లో. దాంతో మరో మాట మాట్లాడే చొరవ చూపలేకపోయింది పార్వతి.

◆ ◆ ◆

"వచ్చే గురువారం మంచిరోజు. వాళ్లు మాట్లాడుకోటానికి వత్తన్నారు. బడికెళ్ల కుండా ఇందిరను ఇంటికాడే వుండమను" పానకాలు అధికార స్వరంతో చెప్పాడు.

"పెళ్లి మాటెత్తగానే గోలపెడ్తంది పిల్ల. రెండ్రోజుల మట్టి సరిగా కూడూ, నీళ్లూ ముట్టటం లేదు."

"తల్లివి నువ్వే నచ్చజెప్పుకోవాలి. చూత్తా చూత్తా మంచి సంబంధం వొదులు కోరెవరూ?"

"సంబంధం ఎట్టాంటిదని గాదు. అసలీవయసులో దానికి పెళ్లిమాట తలపెట్టటమే పెద్ద తప్పు."

"పదమూడేళ్లకే నీకు పెళ్లవలేదా? కాపురాని కొచ్చి బిడ్డల్ని కనలేదా, సాకలేదా? నీ కొచ్చిన లోటేంది?" వెటకారం ధ్వనించింది పానకాలు మాటల్లో.

"ఆ బాధలేవో పడ్డవాళ్లకి తెల్సుద్దిగాని చూచేవాళ్లకేం తెలుసుద్ది! బాగ చదువుకొనే పిల్ల భవిష్యత్తును దుంపనాశనం జేస్తన్నావు."

"ఇదిగో అదిచదివే చదువుకు ఉజ్జోగాలు, ఊళ్లేలటాలు జరిగే పనిగాదు. పెద్ద చదువులు చదివించే శక్తి నాకు లేదు. తల్లీ కూతుళ్లు కలలు గంటన్నారేమో! మోసే వాడికే బరువు తెలుసుద్ది. నోర్మూసుకొని చెప్పింది చెయ్యండి" అంటూ తెగేసి చెప్పాడు నాగమ్మకు.

ఇంత జగమొండిని, మూర్ఖుడ్ని ఎట్లా దారిలోకి తేవాలో నాగమ్మకు అంతుచిక్కని విషయం. మనసులో బాధ చెప్పుకున్నా ఆర్చేవాళ్లు, తీర్చేవాళ్లు, ఎవరుంటారు? బంధువుల్లో ఆడపిల్లకు ఇరవైయేళ్లు దాటేదాకా పెళ్లి చెయ్యకుండా ఆగుతున్న వాళ్లెందరు? ఆర్థిక స్తోమతుండి, చదువు కొంటున్న ఆడపిల్లల విషయంలో మాత్రమే తగిన వయసులో పెళ్లిళ్లు చేస్తున్నారు. తమలాంటి బీదా, బిక్కీ జనం ఆడపిల్లల్ని పై చదువులు చదివించలేక, పెద్దమనిషవుతూనే ఒక అయ్యచేతిలో పెట్టి బాధ్యత తీరిందంటూ చేతులు దులిపేసుకొంటున్నారు. ఆ కారణంగా జరిగే అనర్థాల గురించి ఆలోచించగల వాళ్లెందరు? తనొక్కతె మొగుడి మూర్ఖత్వానికి వ్యతిరేకంగా నిలబడి ఎలా నెగ్గుకొస్తుంది? లోలోన కుమిలిపోసాగింది నాగమ్మ.

"అమ్మా! నా కిప్పుడు పెళ్లేంటమ్మా! నన్ను చదువుకోనివ్వండమ్మా!" తల్లిని ప్రాథేయపడసాగింది ఇందిర.

"నేనేం చెయ్యగలనే తల్లీ! మీ అయ్య మొండోడు. కాదంటుంటే తిట్లూ, తన్నులు తప్ప నా మాట యినిపించుకొంటే గదా!" అంటూ తన నిస్సహాయత వ్యక్తం చేసింది నాగమ్మ. తల్లి మాటలు ఆపిల్లను కలవరపాటుకు గురిచేశాయి.

ఇందిర పెళ్లి విషయంలో అనే కాదు, ఎప్పుడూ తన ఇష్టా ఇష్టాలతో ప్రమేయం అన్నది లేదు నాగమ్మకు. పెళ్లికి ముందు కన్నవాళ్లు, పెళ్లయ్యాక కట్టుకున్న మొగుడూ ఆమెను శాసించారు. తెలియని తనం కొంతా, తెలిసీ ఏం చెయ్యలేని నిస్సహాయత కొంతా జీవితాన్ని అస్తవ్యస్తం చేశాయి. తన బతుకులా తన కూతురి బతుకూ నాశనం కాకూడదని ఆమె కోరిక. అందుకు చెయ్యగలిగిన ప్రయత్నమంతా చేసింది. ఐతే ఆశించిన ఫలితం రాకపోవటంతో నిరాశతో తల్లడిల్లిపోసాగింది.

పన్నెండోయేడు నిండుతూనే పెద్దమనిష్యింయందంటూ చాపమీద కూచోబెట్టి పేరంటాళ్లను పిలుస్తుంటే ఏదో విశేషంగా సిగ్గుపడిపోయింది. పద్నాలుగోయేడు వస్తూనే పెళ్లి కుదిర్చారు. కొత్త బట్టలు, బంధుజనం, మేళతాళాలు, ఊరేగింపు, పెళ్లి సంబరం సరదాగా వుందనిపించింది. పదిహేనేళ్లు నిండకుండానే కడుపొచ్చి, ఆరోనెలలో గర్భస్రావమై చావు ముంగిటదాకా వెళ్లొచ్చినప్పుడు తెలిసొచ్చింది, చిన్న వయసులోనే జరిగిన పెళ్లివలన జరిగే అనర్థాల గురించి.

రెండో కాన్పుతో ఆపరేషన్ చేయించుకోటానికి సిద్ధపడింది. మగబిడ్డ లేకుండా ఆపరేషన్ ఏంటంటూ మొగుడు పడనివ్వలేదు. ముగ్గురాడ పిల్లల తర్వాత నాలుగో కాన్పులో మగబిడ్డ కలిగాక గాని ఆపరేషన్ చేయించుకోనివ్వలేదు. ఇరవై రెండేళ్లకే నలుగురు బిడ్డల తల్లయింది. కాన్పుమీద కాన్పు, అనారోగ్యాలు, శారీరక శ్రమతో, ముప్పయ్యేళ్లకే ఆమెను ముసలిదాన్ని చేసేశాయి. మనసు, శరీరం సరిగా ఎదగకుండానే ఆడదానికి పెళ్లవటం, బిడ్డల్ని కనటం మూలంగా ఎన్నో అనర్థాలు జరుగుతాయన్న అవగాహన కలిగే కాలానికి, నాగమ్మకు జీవితంలో జరగాల్సిన చెడంతా జరిగిపోయింది. బండెడు ఇంటి చాకిరి, బిడ్డల్ని కనటం, పెంచటం లాంటి అవసరాలకే ఆడదాని జీవితం పరిమితం కావటమన్న దానికి ఉదాహరణగా నాగమ్మ జీవితం నిలబడింది. తన మనసుకు నచ్చని విషయం మీద తిరగబడిన ప్రతిసారీ ఓటమి పాలుకాక తప్పటం లేదు.

◆ ◆ ◆

ఇందిరకు వయసుకి మించిన ఆలోచనలున్నాయి. తెలివితేటలున్నాయి. తను పెద్ద చదువులు చదవాలని, ఉద్యోగం చెయ్యాలనీ, స్వశక్తితో బతకాలనీ భవిష్యత్తు

గురించి కలలుగంటున్నది. హఠాత్తుగా తండ్రి తనకు పెళ్లి తలపెట్టడం జీర్ణించుకోలేకపోతున్నది. ఈ విషయంలో తల్లి నిస్సహాయతను గ్రహించగలిగింది.

క్లాసులో వింటున్న పాఠాలు బుర్రకెక్కటం లేదు. తిండి సహించటం లేదు. నిద్రా పట్టటం లేదు. మరో రెండు రోజులు మాత్రమే బడికి రాగలుగుతుంది! పెళ్లి ఖాయపరుచుకొంటే బడి మాన్పిస్తారు. ఇంతకాలం తన మనసులో గూడు కట్టుకున్న ఊహాసౌధాలన్నీ ఒక్కసారిగా కుప్పకూలిపోతాయి. ఈ ఆపదనుండి గట్టెక్కడానికి తగిన ఉపాయం ఏమిటన్న ఆలోచనలతో సతమతమైపోతున్నది ఇందిర.

క్రిందటేడు స్కూల్లో జరిగిన 'స్కూల్ హెల్త్ ఎడ్యుకేషన్' కార్యక్రమం కళ్లముందు మెదిలింది. సైన్స్ టీచర్ కుటుంబరావు క్లాసు పిల్లలందర్నీ గ్రూపులుగా విభజించారు. తనో గ్రూపుకు నాయకురాలైంది. ఆ కార్యక్రమంలో రెండ్రోజుల పాటు కుటుంబ ఆరోగ్యం గురించి, జీవననైపుణ్యాల గురించి ఎన్నో విషయాలు బోధించారు. లైంగికత, లైంగికంగా వ్యాపించే వ్యాధులు, ఆడమగ పిల్లల మధ్య సంబంధాలు, చిన్నవయసులో పెళ్లిళ్లు, గర్భం రావటం గురించి విద్యార్థులకు అవగాహన కలిగేలా చర్చలు, అభ్యాసాలు చేయించారు.

21 సంవత్సరాలు వచ్చేదాకా ఆడపిల్లలకు పెళ్లిళ్లు చెయ్యకూడదని, చిన్న వయసులో లైంగిక అవయవాలు పరిపూర్ణ పరిమాణానికి ఎదగక పోవటం వలన గర్భం ధరిస్తే శారీరక సమస్యలు తీవ్రంగా వుంటాయనీ, ప్రసవం కష్టమవుతుందనీ తెలిసింది. ఒక్కోసారి గర్భం సమయంలో, బిడ్డ పుట్టే సమయంలో సమస్యలు తలెత్తి మరణం కూడా సంభవించవచ్చన్నారు. పుట్టే బిడ్డ తక్కువ బరువుతో పుట్టి చనిపోవటమో, అనారోగ్యం పాలవటమో జరుగుతుందని చెప్పారు. ఆ తరువాత కూడా ఆడపిల్లలంతా ఆ విషయాల గురించి స్కూల్లో అనేక సార్లు చర్చించుకోవటం, చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోకూడదని నిర్ణయించుకోవటం జరిగింది.

తండ్రి తన ఇష్టానికి వ్యతిరేకంగా తనకు పెళ్లి తలపెట్టటం, దాంతోపాటు చదువుకు ముందు ఉద్వాసన చెప్పాల్సి రావటం ఇందిర సహించలేకపోతోంది. గంగిరెద్దులా తలూపటం కన్నా ధైర్యంగా తండ్రిని ప్రశ్నించాలనుకొంది.

"నాన్నా! నాకు చదువుకోవాలనుంది. ఇంత చిన్న వయసులో పెళ్లి చేసుకోవటం మంచిది కాదు. చట్ట ప్రకారం తప్పుకూడా" అంటూ తండ్రిని నిలదీసింది ఇందిర.

"ఏవే! వేలెడంత లేవు. నాకే నీతులు చెప్తావా! మీ అమ్మ నిన్ను ఎక్కేసి పంపినట్టుంది. ఈ పెళ్లి కాదంటే మీ ఇద్దర్నీ పీకపిసికి, నిలువునా పాతేస్తా" అంటూ నానా తిట్లూ తిట్టాడు తప్ప చెప్పేది వినిపించుకోలా. తండ్రి మూర్ఖపు పట్టుదలకు తల్లడిల్లింది ఇందిర.

ఇందిర స్నేహితురాళ్లను వెంటేసుకొని కుటుంబరావు మాస్టార్ని కలిసింది. తనకు పెళ్లి చెయ్యాలన్న తండ్రి నిర్ణయం, మూర్ఖపు పట్టుదల, తన అయిష్టత వివరించి చెప్పింది. ఎలాగోలా ఈ పెళ్లి తప్పించమని కన్నీటితో చేతులు జోడించింది. ఇలాంటి సున్నితమైన విషయంలో నేరుగా తను జోక్యం చేసుకోవటం అంత మంచిది కాదను కొన్నాడు.

" చూడండమ్మా! ఈ సమస్య ఒక్క ఇందిరది అనుకోకుండా, మీ అందరిదీ అనుకోవాలి. మీరంతా ఒక్కటై ధైర్యంగా నిలబడండి. ఈ కాలపు పిల్లలుగా, మీ జీవితాలను తగిన నైపుణ్యంతో తీర్చిదిద్దుకోగలగాలి. ఏం చేస్తే ఇందిర తండ్రి దారిలోకి వస్తాడో బాగా ఆలోచించండి. మేం మీ ముందుండి నడిపించకూడదు. మీ వెనుక నుంచి కథ నడపాలి" అంటూ కర్తవ్యం బోధించాడు కుటుంబరావు.

ఇంకేం! స్కూలు ఆడపిల్లలంతా ఒకటయ్యారు. ఇందిర పెళ్లి గురించి చర్చించారు. సమస్య ఈ రోజు ఇందిరదైతే, రేపు మరొకరిది కావచ్చనుకొన్నారు. ఇందిర తండ్రికే కాదు, అలాంటి మూర్ఖపు ఆలోచనలు చేసే తండ్రులందరికీ గొప్ప గుణపాఠం చెప్పి తీరాలనుకొన్నారు. అందుకు ఏం చెయ్యాలో ఆలోచించి కలిసికట్టుగా ఒక నిర్ణయానికొచ్చారు.

గురువారం ఉదయం స్కూలు గేటు తెరుచుకోలేదు. గేటు ముందు ఆడపిల్లలు అడ్డంగా బైటాయించారు. వాళ్ళ చేతుల్లో రకరకాల నినాదాలు రాసున్న ప్లకార్డులు పురుషాధిక్యంపై సంధిస్తున్న అస్త్రాల్లా వున్నాయి.

"మాకు చదువులు కావాలి".

"చిన్న వయసులో పెళ్లి ఆరోగ్యానికి ముప్పు".

"21 సంవత్సరాలు దాటాక ఆడపిల్లకు పెళ్లి".

"ఇందిరకు న్యాయం చెయ్యాలి."

"ఇందిరకు పెళ్లొద్దు. చదువు కావాలి".

అంటూ రాసున్న రకరకాల నినాదాలు చదువుతూ ఊరంతా ఆశ్చర్యపో సాగింది. పానకాలు కూతురికి తలపెట్టిన బలవంతపు పెళ్లికి నిరసనగా, స్కూలు ఆడపిల్లలు తలపెట్టిన దీక్షకు మద్దతుగా నిలబడ్డారు.

కుటుంబరావు మాస్టారు రెండోకంటికి తెలియకుండా పిల్లల నిరసన కార్యక్రమాన్ని ప్రింట్ మీడియాతోపాటు ఎలక్ట్రానిక్ మీడియా చెవిలో రహస్యంగా ఊదాడు. మధ్యాహ్నానికల్లా మీడియా అక్కడకు చేరుకుంది. టీవీ చానెళ్ల వాళ్లు కెమేరాలు బిగించి రాష్ట్రవ్యాపిత ప్రచారానికి తెరదీశారు. మహిళా సంఘాలు ముక్తకంఠంతో మద్దతు ప్రకటించాయి.

జిల్లా హెడ్ క్వార్టర్ నుండి కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాధికారులు, జిల్లా సంక్షేమ అధికారులు పరుగుల మీద గ్రామానికొచ్చారు. ఉపాధ్యాయుల్నీ, గ్రామపెద్దల్నీ సమావేశపరిచారు. పానకాల్ని ముద్దాయిలా ప్రజాకోర్టులో నిలబెట్టారు.

పిల్లల నిరసన గళాలు, పెద్దల చివాట్లు, అధికారుల హెచ్చరికలు పానకాల గుండెలో దడపుట్టించాయి. తలకెక్కి తైతెక్కలాడిస్తున్న పురుషాహంకారం ఒక్క పెట్టున నేలకు దిగింది. పదిమందిలో తప్పు ఒప్పుకొని చెంపలేసుకొన్నాడు. కూతురి అభీష్టాన్ని మన్నించటానికి మనస్ఫూర్తిగా అంగీకరించాడు.

తల్లిగా తను పరిష్కరించలేని సమస్యను తనకు తానుగా కూతురు పరిష్కరించుకొన్న తీరుకు, భర్తకు బుద్ధి చెప్పినందుకు నాగమ్మ గర్వంతో ఉప్పొంగిపోయింది.

ఇందిర ప్రదర్శించిన తెగువ, ఆత్మస్థైర్యం, ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం ఈ కాలపు ఆడపిల్లల హృదయాల్లో ఆ పిల్లను ఆదర్శ బాలికగా నిలబెట్టాయి.

❋

*(విశాలాంధ్ర దినపత్రిక , 14 ఆగస్టు 2011)*